ఎల్వీప్రసాద్ కంటి ఆస్పత్రికి అరుదైన పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న మహావీర్ సి.జైన్

హైదరాబాద్‌సిటీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థకు అరుదైన పురస్కారం లభించింది. గుర్గావ్‌లోని హయాత్ రెజెన్సీలో జరిగిన ప్రతిష్ఠాత్మక గ్లోబల్ కార్పొరేట్ సోషల్ రెసాన్స్‌బులిటీ (సీఎస్ఆర్)-ఎన్విరాన్‌మెంటల్ సోషల్ అండ్ గవర్నమెంట్ (ఈఎస్జీ) అవార్డ్స్‌లో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యవిజ్ఞాన సంస్థ(ఎల్వీపీఈఐ)కు టాప్ 10 బెస్ట్ ఎన్‌జీవోస్ ఆఫ్ ది ఇయర్ 2024 పురస్కారం అందుకుంది. ఎల్వీపీఈఐ తరఫున పబ్లిక్ రిలేషన్స్, డోనర్ ఎఫైర్స్ బృందంలోని మహావీర్ సి.జైన్ ఈ పురస్కారాన్ని స్వీకరించారు. అవార్డు సాధనలో సిబ్బంది అందరి అవిరాళ కృషి, అంకితభావం, దాతలు, భాగస్వాముల అచంచల మద్దతు ఉందని ఎల్వీపీఈఐ ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుడు డాక్టర్ ప్రశాంత్ గర్గ్ పేర్కొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలు చేపట్టాలి

హైదరాబాద్ సిటీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలు చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంపై ఆయన అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలపై విద్యాశాఖతోపాటు ఇతర శాఖల అధికారులు, పాఠశాలల ఉపాధ్యాయులు బస్తీల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఆగస్టు 15న ఆవిష్కరణల ప్రదర్శన ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు ఆవిష్కరణ పేరు, ప్రదర్శనకు సంబంధించిన రెండు నిమిషాల వీడియో, ఆవిష్కరణలకు సంబంధించిన నాలుగు ఫొటోలు, 100 పదాలతో రాసి తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ వాట్సప్ నంబర్: 9100678543కు ఆగస్టు 3వ తేదీ లోపు పంపాలని సూచించారు. అనంతరం కలెక్టర్, అధికారులు ఇంటింటా ఇన్నోవేషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటాచారి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కదిరివన్, డీఈఓ రోహిణి, డీఎస్ఓ రమేష్, ఈ-డీఎం రజిత, డీపీఆర్ఓ ఎం.ఏ కలీం, ఇంటింటా ఇన్నోవేటర్ జిల్లా రిప్రెజెంటేటీవ్ వినీత్ సిద్దార్థ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉస్మానియా'లో ప్లాస్టిక్ సర్జరీ సేవలు ప్రారంభం

హైదరాబాద్ సిటీ, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ రోజును పురస్కరించుకుని ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో ప్లాస్టిక్ సర్జరీ సేవలను సోమవారం ప్రారంభించినట్లు యూనిట్ చీఫ్, ప్రొఫెసర్ డాక్టర్ పలుకూరి లక్ష్మి తెలిపారు. ఈసేవలు 15వతేదీ వరకు అందుబాటులో ఉంటాయని చెప్పారు. పెదవి చీలిక, అంగిలి చీలిక, చెవి లేకుండా పుట్టిన పిల్లలు, జోడించిన వేళ్లు, బొటనవేలు లేకపోవడం, కాలిన మచ్చలు, కాలిన వైకల్యాలు, పోస్ట్ ట్రామా మచ్చలు, బొల్లి పాచెస్, కుష్ఠ వ్యాధి సమస్యలు, చేతి, దవడ కణితులు, పెద్ద, చిన్న రొమ్ములు, తల, ముఖ వైకల్యాలకు చికిత్స అందిస్తారని చెప్పారు. ఆస్పత్రిలోని 202 నంబర్ గల ఓపీ గదిలో సోమవారం నుంచి శనివారం వరకు ప్లాస్టిక్ సర్జన్లు చేసే అన్ని రకల ఆపరేషన్లపై అవగాహన కల్పిస్తారని, తర్వాత శస్త్రచికిత్సలు చేస్తారని వివరించారు.

బైక్‌లను దొంగిలిస్తున్న ముఠా అరెస్టు


కేసు వివరాలు వెల్లడిస్తున్న మాదాపూర్ అడిషనల్ డీసీపీ జయరాంరెడ్డి

రాయదుర్గం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): హాస్టళ్లు, హోటళ్ల ఎదుట పార్కు చేసిన ద్విచక్రవాహనాలను దొంగిలిస్తున్న ముఠాను గచ్చిబౌలి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 16 బైక్‌లను స్వాధీనం చేసుకున్నా రు. ఈ మేరకు సోమవారం గచ్చిబౌలి పీఎస్‌లో మాదాపూర్ అడిషనల్ డీసీపీ జయరాంరెడ్డి, ఏసీపీ శ్రీకాంత్, ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు కేసు వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దేవకిషోర్(20), కడియాల వీరవెంకట సత్యనారాయణ(21), ఏసుబాబు(17), సిద్దు(17), దిలీప్(19) బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చారు. స్విగ్గిఫుడ్ డెలివరీ బాయ్స్‌గా పనిచేస్తుండటంతో వీరందరి మధ్య పరిచయం ఏర్పడింది. సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో హాస్టళ్లు, కార్యాలయాలు, ఇళ్లు, హోటళ్ల ఎదుట పార్కు చేసిన బైక్‌లను లక్ష్యంగా చేసుకుని దొంగిలించేవారు. వీరిలో ఒకరికి ఓ షోరూంలో టెక్నిక్‌లాన్‌గా పనిచేసిన అనుభవం ఉండడంతో చోరీ చేసిన బైక్‌ల కీసెట్‌లను మార్చేవాడు. వాటిని తక్కువ ధరలకు విక్రయిస్తూ విలాసవంతమైన జీవితానికి అలవాటుపడ్డారు. అయితే, కొంతమంది వాటి పత్రాలు సరిగా లేకపోవడంతో కొనేందుకు నిరాకరించారు. దీంతో ఈ వాహనాలను ఆంధ్రప్రదేశ్‌కు తరలించాలని ప్లాన్ చేశారు. సోమవారం కొండాపూర్ బొటానికల్ గార్డెన్ వద్ద గచ్చిబౌలి పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన దొంగతనాలు వెలుగులోకి వచ్చాయి. వీరు వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో దొంగిలించిన 16 బైక్‌లను స్వాధీనం చేసుకుని ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.


మాట్లాడుతున్న తెలంగాణ మాల సంఘాల జేఏసీ చైర్మన్ రాంచందర్ తదితరులు

ఎస్సై మృతికి కారకులైన అధికారులను తొలగించాలి

- సీఐ, కానిస్టేబుళ్లపై ఎస్సీఎస్టీ అత్యాచార నిరోధక చట్టం పెట్టాలి

ఖైరతాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దళిత వర్గానికి చెందిన అశ్వారావుపేట ఎస్సై శ్రీనివాస్ మరణానికి కారకులైన సీఐతో పాటు సిబ్బందిని విధుల నుంచి శాశ్వతంగా తొలగించాలని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. సోమవారం ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్ అంబేద్కర్ స్ఫూర్తి భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించి విలేకరులతో చెరకు రాంచందర్, ప్రతినిధులు మాట్లాడారు. ఆత్మహత్యకు ప్రేరేపించిన అధికారులు, ఉద్యోగులపై ఎస్సీఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో బలమైన సాక్ష్యాలను ప్రవేశపెట్టి నిందితులకు కఠిన శిక్షలు పడేలా చేయాలని, సత్వర న్యాయం జరిపేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు కేసును అప్పగించాలన్నారు. మృతి చెందిన శ్రీనివాస్ కుటుంబ సభ్యుల్లో ఒకరికి గ్రూప్ వన్ ఉద్యోగం ఇవ్వాలని, ఆయన కుటుంబానికి రూ.రెండు కోట్ల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జేఏసీ వర్కింగ్ చైర్మన్లు బెరా బాలకిషన్, మేక వెంకన్న, వైస్ చైర్మన్లు నర్మెట మల్లేష్, గంగాధర్, గడ్డం సత్యనారాయణ, చింతపల్లి కాశబూనాథ్, అచ్యుతయ్య, కృష్ణ, రమేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 5 కోట్ల విలువైన డ్రగ్స్ ధ్వంసం

- రాచకొండ కమిషనరేట్ పరిధిలో గత ఏడాది పట్టుబడ్డ డ్రగ్స్


బయోమెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో డ్రగ్స్‌ను ధ్వంసం చేస్తున్న డ్రగ్ డిస్పోజబుల్ కమిటీ అధికారులు

హైదరాబాద్ సిటీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాచకొండ కమిషనరేట్ పరిధిలో గత ఏడాది పలు కేసుల్లో పట్టుబడ్డ గంజాయి తోపాటు పలురకాల డ్రగ్స్‌ను డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ధ్వంసం చేశారు. సీపీ తరుణ్ జోషి ఆదేశాల మేరకు డ్రగ్ డిస్పోజబుల్ కమిటీ చైర్మన్ ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్, సభ్యులు అడ్మిన్ డీసీపీ పి.ఇందిర, మల్కాజిగిరి ఏసీపీ ఎస్.చక్రపాణి, సీసీఆర్‌బీ ఏసీపీ రమేష్ కుమార్‌ల ఆధ్వర్యంలో తుక్కాపూర్‌లోని బయోమెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో డ్రగ్స్‌ను ధ్వంసం చేశారు. కమిషనరేట్ పరిధిలో 23 పోలీస్‌స్టేషన్‌లలో ఏడాది వ్యవధిలో పట్టుబడ్డ 3,484 కిలోల గంజాయి. 402 కిలోల నల్లమందు పౌడర్, 14 గ్రాముల ఎండీఎంఏ, 3.50 కిలోల హష్ ఆయిల్, 45 గ్రాముల మెఫిడిన్, 958 గ్రాముల చరస్, 100 గ్రాముల గంజాయి చాక్లెట్లు మొత్తం కలిపి రూ.5.03,31,783 విలువైన డ్రగ్స్‌ను సోమవారం అధికారులు ధ్వంసం చేశారు.

దివ్యాంగుల హక్కుల చట్టం అమలు చేయాలి

- ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేర్చాలి
- రూ.6000 పింఛన్ పెంచి అందజేయాలి


తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఇందిరాపార్కు వద్ద ధర్నా చేస్తున్న తెలంగాణ దివ్యాంగుల సంఘం నేతలు

కవాడిగూడ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల హక్కుల చట్టం 2016 పూర్తి స్థాయిలో అమలు చేయాలని, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం రూ. 6000 పింఛన్ వెంటనే అమలు చేయాలని తెలంగాణ దివ్యాంగుల సమైక్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు భిక్షపతియాదవ్ డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాలో దివ్యాంగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. దివ్యాంగులకు ఐదువాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని, ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం సౌకర్యాం కల్పించాలని, అర్హులైన వారందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు, లేక ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వాలన్నారు.

ధర్నాకు బీఆర్ఎస్ మహిళా నాయకురాలు సంధ్య, వివిధ సంఘాల ప్రతినిధులు మద్దతు ప్రకటించి వారు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

ధర్నాలో తెలంగాణ దివ్యాంగుల సమైక్య సంఘం రాష్ట్ర నాయకులు రామకృష్ణ, శ్రావణ్ కుమార్, భువనేశ్వర్, వరలక్ష్మి, విజయ్‌కుమార్, ప్రసాద్, ధనమ్మతోపాటు దివ్యాంగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఏఐసీఎఫ్ కార్యవర్గం ఏర్పాటు

చిక్కడపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా క్రిష్టియన్ ఫెడరేషన్(ఏఐసీఎఫ్) కార్యవర్గాన్ని సోమవారం ఏర్పాటు చేసినట్లు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏకే గిడియోన్‌బాబు తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా బిషప్ డా.జి. శామ్యూల్‌జాన్, కోశాధికారిగా పి.సోలమన్ రాజ్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎస్. అబ్రహం, సీనియర్ ఉపాధ్యక్షుడిగా ఎస్ ప్రదీప్, ఉపాధ్యక్షులుగా బిషప్ డా. ఎం. యస్ దయానంద్, బి. దేవసహాయం, ఉప కార్యదర్శిగా వనితా అరెగ్జాండర్, సహాయ కార్యదర్శులుగా జాన్‌సుందర్‌రాజ్, కడియం కృపాకర్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా పాస్టర్ కె. ప్రభాకర్, వందనం, పాస్టర్ జిల్ల శాంతికుమార్, మీడి యా కార్యదర్శిగా డా.శామ్యూల్‌ను ఎన్నుకున్నట్లు వివరించారు.

అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

చిక్కడపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ రక్షణ, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు చట్టబద్ద సౌకర్యాలు కల్పించాలని రాష్ట్రంలో 24 రోజుల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.జయలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఈ నెల 10న జరిగే ఆలిండియా డిమాండ్స్‌డే నిరసన కార్యక్రమాల్లో రాష్ట్రంలోని అంగన్‌వాడీ ఉద్యోగులు పాల్గొంటారని ఆమె అన్నారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ డైరెక్టర్‌కు సమర్పించినట్లు ఆమె పేర్కొన్నారు.

కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

చిక్కడపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కళాకారులు, కళాసంస్థలకు ప్రభుత్వం తోడ్పాటునివ్వాలని కోరుతూ తెలంగాణ కల్చరల్ ఆర్గనైజర్స్ ఫోరం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సంస్థ ప్రతినిధులు కిన్నెర రఘురామ్, కేవీ రావు, గొర్తి చంద్రశేఖర్, బృందావనం సుబ్రహ్మణ్యం, రామాచారిలు రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ ప్రాంతాలు, జిల్లాల నుంచి నగరానికి వచ్చే పేద కళాకారులకు వసతి కోసం ప్రభుత్వమే స్థలం కేటాయించి వసతి గృహాన్ని నిర్మించి ఇవ్వాలని కోరా పేద కళాకారులు, కళాసంస్థల వారికి ప్రభుత్వం ఆర్థిక సాయం, పెన్షన్ సౌకర్యాలు అందరికి కల్పించాలని కోరారు.

డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరించాలి

- కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుప్రియ

ముషీరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్‌లో పెరిగిన జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరించాలని ముషీరాబాద్ డివిజన్ కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్ అన్నారు. సోమవారం డివిజన్‌లోని భారత్ సేవా సమాజ్ కమ్యూనిటీ హాల్ నుంచి బాపూజీనగర్ ప్రధాన రోడ్డు వరకు రూ.5 లక్షలతో చేపట్టిన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్ జలమండలి అధికారులతో కలిసి పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన ఐజాక్‌రాజ్



కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యుడిగా నియమితులైన సందర్భంగా కేంద్ర గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డిని సోమవారం ఆయన నివాసంలో నల్లకుంటకు చెందిన బీజేపీ మైనారిటీ మోర్చా మీడియా కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎం. ఐజాక్‌రాజ్ కలిసి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కిషన్‌రెడ్డి ఆయనకు శాలువాకప్పి సత్కరించారు. - నల్లకుంట, ఆంధ్రజ్యోతి


నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్‌కు చెందిన ఎన్ఎస్‌యూఐ గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు ఎం.డి ఫజీల్ మాజీ సీఎం దివంగత డాక్టర్ వై.ఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి సందర్భంగా సోమవారం గాంధీభవన్‌లో జరిగిన రక్తదాన శిబిరంలో పాల్గొన్నందుకు సీఎం రేవంత్‌రెడ్డి అతన్ని ప్రశంసించి సర్టిఫికెట్ ప్రదానం చేశారు.
- నల్లకుంట, ఆంధ్రజ్యోతి


ప్రభుత్వ సలహాదారుడిగా నియమితులైన కేశవరావును పూలబొకేతో సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మహేష్‌యాదవ్, తదితరులు -బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి


పోచమ్మబస్తీలో ప్రజా సమస్యలపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్

ప్రజా సమస్యలపై అధికారులు చర్యలు తీసుకోవాలి

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్ పరిధిలో పలు చోట్ల చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణం, ప్యాచ్ వర్క్ పనులను వెంటనే పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులను అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆదేశించారు. సోమవారం డివిజన్‌లోని పోచమ్మబస్తీలో కార్పొరేటర్ బి. పద్మావెంకటరెడ్డితో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని ప్రాంతాలకు సమానంగా మంచినీటి సరఫరా జరిగేలా జలమండలి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వెలగని వీధి దీపాలను గుర్తించి ఆయా ప్రాంతాలలో వీధి దీపాలు ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు బొట్టు శ్రీను తల్లికి ఇటీవల ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో ఎఎంహెచ్‌వో డాక్టర్ హేమలత, ఎలక్ట్రిసిటీ ఏఈ సౌమ్య, డీఈ ప్రవీణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, జలమండలి మాజీద్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాస్

ఆరోగ్య పరీక్షల పేరిట భారీ దోపిడీ

- టెండర్ లేకుండానే ప్రైవేట్ కంపెనీకి కట్టబెట్టిన ప్రభుత్వాలు
- సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాస్ ఆరోపణ

రాంనగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు ఆరోగ్య పరీక్షల పేరిట జరుగుతున్న భారీ దోపిడీపై విచారణ జరిపించాలని సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టెండర్ లేకుండానే ప్రైవేట్ కంపెనీకి కట్టబెట్టిన బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలని ఆరోపించారు. లక్షల్లో పరీక్షలు చేస్తున్నట్లు అడ్డగోలు లెక్కలు, వందల కోట్ల దోపిడీ జరుగుతుందని ఆరోపించారు. సోమవారం గోల్కొండ చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో భవన ఇతర నిర్మాణ కార్మికులందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2022లో సీఎస్‌సీ హెల్త్ కేర్ వెల్‌నెస్ సర్వీసెస్ లిమిటెడ్ సంస్థకు కాంట్రాక్ట్ ఇచ్చారని అన్నారు. ఒక్కో కార్మికుడికి ఆరోగ్య పరీక్షల నిమిత్తం రూ.3,256 చొప్పున ప్రైవేట్ సంస్థకు భవన ఇతర నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు చెల్లించాలని నిర్ణయించారని ఆయన గుర్తు చేశారు. గతేడాది ఆరోగ్య పరీక్షల కోసం రూ. 124 కోట్లు ఖర్చు చేసిందని, అయితే ఇందులో అనేక దొంగ లెక్కలు సృష్టించి భారీ ఎత్తున బోర్డు నిధులను కాంట్రాక్ట్ సంస్థ అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. గత యేడాది టెండర్ లేకుండానే వందల కోట్ల విలువైన ఒప్పందాన్ని ప్రభుత్వం ఎలా కుదుర్చుకుందని ప్రశ్నించారు. ఈ మొత్తం ఒప్పందంపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ పరిషత్‌ను పునః ప్రారంభించాలి

- తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు రమణారావు

నల్లకుంట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బ్రాహ్మణ పరిషత్‌ను పునః ప్రారంభించి బ్రాహ్మణ కార్పొరేషన్ నియమించాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి (టీబీఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సోమవారం నల్లకుంటలోని టీబీఎస్ఎస్ కార్యాలయంలో సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తెలంగాణ బ్రాహ్మణ పరిషత్‌ను పునః ప్రారంభించాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబులను కోరారు. ప్రతిభావంతులైన పేద బ్రాహ్మణ విద్యార్థుల విదేశీ విద్య కోసం వివేకానంద స్కీమ్, బ్రాహ్మణ పరిషత్ ద్వారా మొదటి విడత ఫీజులు చెల్లించారని, సెకండ్ టర్మ్ ఫీజుల చెల్లింపులు నిలిచిపోయాయని అన్నారు. దీంతో విద్యార్థులు ఫీజులు చెల్లించలేక విదేశాల్లో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని బ్రాహ్మణ పరిషత్‌ను పునః ప్రారంభించి, కార్పొరేషన్ ద్వారా విద్యార్థులు ఫీజులు చెల్లించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో టీబీఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగారావు, ప్రధాన కార్యదర్శి మంత్రి సునీల్, దేశ్‌ముఖ్ రమాకుమార్, రామారావు తదితరులు పాల్గొన్నారు.


రేణుక ఎల్లమ్మ తల్లికి కల్లుఘటం, శాకబోనం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

బోనాల వేడుకలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు

- మంత్రి పొన్నం ప్రభాకర్

బర్కత్‌పుర, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలో నిర్వహించనున్న ఆషాడమాస బోనాల వేడుకలను వైభవంగా నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గౌడ ఐక్య సాధన సమితి ఆధ్వర్యంలో ఈనెల 23న గోల్కొండ కోటలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లికి 11వ కల్లుఘటం, శాకబోనం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గోల్కొండ బోనాలతో పాటు సికింద్రాబాద్, లాల్ దర్వాజ బోనాలను కూడా వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్ మాట్లాడుతూ, ఈ నెల 23న రేణుక ఎల్లమ్మ తల్లికి కల్లు, ఘటం, శాకబోనం సమర్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు భిక్షపతిగౌడ్, అధికార ప్రతినిధి నర్సింహగౌడ్, మహిళా విభాగం అధ్యక్షురాలు బింగి ఇందిరాగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మానసగౌడ్, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మహేందర్‌గౌడ్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి బొమ్మన రాజుగౌడ్ పాల్గొన్నారు.


కాచిగూడలో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

రోడ్లపై వర్షం నీరు నిల్వకుండా చర్యలు

- కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

బర్కత్‌పుర, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో రోడ్లపై నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ కన్నెఉమాదేవి తెలిపారు. సోమవారం డివిజన్ పరిధిలోని నింబోలి అడ్డ, రహమత్‌బాగ్, చప్పల్‌బజార్ తదితర ప్రాంతాలలో పాదయాత్ర నిర్వహించి ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వర్షం నీరు రోడ్లపై నిలుస్తుండటంతో తాము ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్లపై ఉన్న గుంతలను వెంటనే పూడ్చివేయాలని జీహెచ్ఎంసీ సిబ్బందిని ఆదేశించారు. నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు లావణ్య, బాల ప్రసాద్, రవియాదవ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎం.డి. హుస్సేన్‌ను బేషరతుగా విడుదల చేయాలి

- పౌర హక్కుల సంఘం నేతల డిమాండ్

నల్లకుంట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మిక సమాఖ్యలో కార్మిక నేతగా పనిచేసిన ఎం.డి. హుస్సేన్‌ను మఫ్టీలో వచ్చిన పోలీసులు కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని తన ఇంటి నుంచి కిడ్నాప్ చేసి తీసుకెళ్లారని తెలంగాణ పౌర హక్కుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ లక్ష్మణ్. గడ్డం, ఎన్. నారాయణ రావులు అన్నారు. సోమవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్మిక నేతగా పనిచేసిన ఎం.డి. హుస్సేన్ 15 ఏళ్లుగా ప్రశాంతంగా జీవిస్తున్నారని గుర్తు చేశారు. మఫ్టీలో వచ్చిన పోలీసులు తీసుకెళ్లడంతో ఆయనకు ప్రాణహాని ఉందని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. పోలీసులు వెంటనే హుస్సేన్‌ను విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో విరసం రాము, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడలో డిగ్రీ విద్యార్థి అదృశ్యం

బర్కత్‌పురా జూలై 8 (ఆంధ్రజ్యోతి): కాచిగూడలో డిగ్రీ విద్యార్థి అదృశ్యమయ్యాడు. సీఐ కె. చంద్రకుమార్. అడ్మిని ఎస్సై సుభాష్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. చప్పల్ బజార్ రహమత్ నగర్‌లో నివాసముంటున్న రాజేష్ కుమార్ జైన్ కుమారుడు జతిన్ జైన్ (22) డిగ్రీ చదువుతున్నాడు. సోమవారం ఉదయం తల్లిదండ్రులు లేచేసరికి జతిన్ జైన్ కనిపించలేదు. పరిసర ప్రాంతాలు బంధువుల ఇళ్లలో వెతికిన అతని ఆచూకీ లభించలేదు సోమవారం రాత్రి తండ్రి కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

రాంనగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా 17 మందితో ఎన్నుకున్నట్లు పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పరశురాం వెల్లడించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడుగా బోనగిరి మధు (మహబూబాబాద్), ఉపాధ్యక్షులుగా ప్రణయ్ (భద్రాద్రి), మంద నవీన్ (హైదరాబాద్), ప్రధాన కార్యదర్శిగా పొడపంగి నాగరాజు (హైదరాబాద్), సహాయ కార్యదర్శులు నరసింహారెడ్డి (సంగారెడ్డి), అజయ్ (వరంగల్), కోశాధికారి మహేష్(యాదాద్రి), కార్యవర్గ సభ్యులు మాదారపు నాగరాజు, తీగల శ్యామ్, టి. సందీప్, ఎం. ప్రవీణ్, కో-ఆప్షన్‌లతో మొత్తం 17 మందితో నూతన కార్యవర్గాన్ని కౌన్సిల్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నూతన అధ్యక్షుడు బోనగిరి మధు, ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజులు మాట్లాడుతూ నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని, నీట్ పరీక్ష నిర్వహించే బాధ్యతలు రాష్ట్రానికే ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్‌ను తక్షణమే విడుదల చేయాలని, తెలంగాణలో ఉన్న అన్ని యూనివర్సిటీలకు పర్మినెంట్ వీసీలు వెంటనే నియమించాలని, ప్రైవేట్ యూనివర్సిటీల బిల్లును రద్దు చేస్తూ ప్రభుత్వ యూనివర్సిటీలను పటిష్ఠపరచాలని, నూతన జాతీయ విద్యావిధానం 2020 రద్దు చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నేడు జాతీయ విద్యార్థి దినోత్సవం: ఏబీవీపీ

హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం విద్యార్థి ఉద్యమం ప్రారంభమై 76 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మంగళవారం దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ యూనివర్సిటీల విభాగం కన్వీనర్ జీవన్ తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ జెండా కోసం ప్రాణాలర్పించిన 48 మంది అమరులకు జోహార్లు అర్పించనున్నట్లు వివరించారు. విద్యార్థుల కోసం నిరంతరం ఏబీవీపీ పనిచేస్తున్నదని పేర్కొన్నారు. 76 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో ఏబీవీపీకి 54,85,514 మంది సభ్యులు ఉన్నారని జీవన్ తెలిపారు.

వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి ఘన నివాళి

రాంనగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ ఆశయాల సాధన కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని అడిక్‌మెట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల్ పేర్కొన్నారు. అడిక్‌మెట్ డివిజన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాంనగర్ గుండు చౌరస్తాలో వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా తిరుమల్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వరదరాజు, ఆనంద్ ముదిరాజ్, వల్లభ్ రెడ్డి, విజయ్‌యాదవ్, కరణం సురేష్, కిరణ్, సతీష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

వైఎస్ఆర్ సేవలు మరువలేనివి

ముషీరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అందించిన సేవలు ప్రజలు ఎన్నటికి మరిచిపోలేరని కాంగ్రెస్ ముషీరాబాద్ నియోజకవర్గం బి-బ్లాక్ కమిటీ కార్యదర్శి రామకృష్ణ ముదిరాజ్ అన్నారు. వైఎస్ఆర్ జయంతి సందర్భంగా వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు లింగం గుప్తా, ముషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు జీఎస్ చారి తదితరులు పాల్గొన్నారు


వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న తిరుమల్, తదితరులు


న్యూ నల్లకుంటలో వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు